www.samasamajam.in

# సమసమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 16 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-126 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# అవినీతి, వారసత్వ రాజకీయాలపై పోరాడుదాం



- అర్హులు, ప్రతిభావంతులకే అవకాశాలు దక్కాలి
- నారీ శక్తిని గుర్తించి వారికి గౌరవం ఇవ్వాలి
- ఏది చేసినా ఇండియా ఫస్ట్ అన్న సంకల్పం రావాలి
- ఐదు తీర్మానాలతో ముందుకు సాగుదాం
- నవ సంకల్పంతో ముందుకు కదలాలి
- అభివృద్ధి చెందిన భారత్‌గా వచ్చే 25 ఏళ్ల నాటికి శతాబ్ది ఉత్సవాలు
- ప్రతి ఒక్కరూ కలసి ముందడుగు వేస్తేనే సమరయోధుల కల సాకారం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ ఉద్వేగపూరిత ప్రసంగం
- ప్రభుత్వ విజయాలు, సంకల్పాలపై సుదీర్ఘ ప్రసంగం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15(సమ సమాజం):** దేశం ముందు ప్రధానంగా రెండు సవాళ్లు ఉన్నాయని, వాటిపై మనమంతా పోరాటం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతిభావంతులు, అర్హులకే అవకాశాలు దక్కాలని చెప్పారు. మహిళలను అందరూ గౌరవించాలని స్పష్టం చేశారు.అవినీతి, బంధుప్రీతి దేశం ముందున్న రెండు అతిపెద్ద సవాళ్లు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఈ రెండిటిపై ప్రజలంతా పోరాడాలని స్పష్టం చేశారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగించిన మోదీ.. బంధుప్రీతి దేశానికి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. నవ సంకల్పంతో, సరికొత్త దారిలో ప్రయాణించే సమయం ఆసన్న మైందన్న మోదీ ..ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ స్వాతంత్య్ర సమరయోధుల కలలను సాధ్యమైనంత త్వరగా సాకారం చేయాల్సిన బాధ్యత భారతీ యులందరిపై ఉందని అన్నారు. అమృత సంకల్పంతో ముందుకు సాగాల్సిన సమయమిది అన్నారు. యావత్ జీవితాన్ని దేశం కోసం అంకితం చేసిన వాళ్లను మరువలేమని పేర్కొన్నారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. వచ్చే 25 ఏళ్ల నాటికి శతాబ్ది ఉత్సవాలను అభివృద్దిన భారత్‌గా ఆవిష్కరించాలన్నారు. జాతి సంపద, ఐక్యతను కాపాడుతూ



వచ్చే 25ఏళ్లలో భారత్‌ను సమున్నత దేశంగా తీర్చిదిద్దేందుకు పనిచేయాలని సూచించారు. ఇందుకోసం ప్రధాని.. ఐదు తీర్మానాలను ప్రతిపాదించారు. ప్రజలంతా వీటిపైనే తమ శక్తినంతా కేంద్రీకరించాలని పిలువునిచ్చారు. స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు అయ్యే నాటికి.. మన దేశం కోసం పోరాడిన వారి కలలను సాకారం చేసి చూపించాలన్నారు. వచ్చే 25ఏళ్ల పాటు యువత దేశ అభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేయాలి. దేశమే కాకుండా మొత్తం మానవజాతి అభివృద్ధికి పాటుపడాలి. అదే భారతదేశానికి ఉన్న బలం. పెద్ద సంకల్పాలతో ముందుకు కదలాలి. స్వాతంత్య్ర శతాబ్ది ఉత్సవాల నాటికి 'భారత్ అభివృద్ధి చెందిన దేశ'మనే కల సాకారం కావాలి. ఇందుకోసం వచ్చే 25 ఏళ్ల పాటు ఐదు సూత్రాలపై

2వ

## దేశ నిర్మాణంలో

# ఆర్థిక శక్తిగా తెలంగాణ



- అన్నిరంగాల్లో తెలంగాణ పురోగమనం
- దేశంలోనే అద్భుత విజయంగా 24 గంటల విద్యుత్
- అత్యధిక ధాన్యం ఉత్పత్తితో దేశానికి అన్నపూర్ణగా మారింది
- 11.6 శాతం రికార్డు స్థాయి వ్యవసాయ వృద్ధిరేటు
- మిషన్ భగీరథతలో వందశాతం గ్రామాలకు తాగునీటి సౌకర్యం
- గోల్కొండ కోటపై జెండా ఎగురేసిన సిఎం కెసిఆర్
- తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంపై సాధించిన విజయాల వివరణ

**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** దేశ నిర్మాణంలో బలమైన ఆర్థికశక్తిగా తెలంగాణ రూపొందిందని సిఎం కెసిఆర్ అన్నారు. గోల్కొండ కోటలో సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ..సమైక్య రాష్ట్రంలో అంధకారంలో కొట్టుమిట్టాడిన తెలంగాణ.. ఇవాళ అన్ని రంగాలకు 24 గంటలపాటు విద్యుత్తును అందిస్తూ.. ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభంతో సతమతమైన తెలంగాణ నేడు స్వరాష్ట్రంగా 11.6 శాతం రికార్డు స్థాయి వ్యవసాయ వృద్ధిరేటు తో దేశానికి అన్నం పెడుతూ అన్నపూర్ణగా అవతరించిందని చెప్పారు. జాతీయోద్యమ స్ఫూర్తితో, అహింసా మార్గంలో, శాంతియుత పంథాలో తెలంగాణ రాష్ట్రాన్నిసాధించుకున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. స్వాతంత్య్ర పోరాట వీరుల ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగించుకుంటు న్నామని చెప్పారు. స్వతంత్ర భారతంలో 60 సంవత్సరాలు తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యమించిన తెలంగాణ స్వరాష్ట్రంగా అవతరించి, నేడు దేశానికే దిక్సూచిగా మారి దేదీప్యమానంగా వెలుగొందుతోందని అన్నారు. ప్రతి రంగంలోనూ దేశం నివ్వెరపోయే ఫలితాలు సాధిస్తూ, ప్రగతి పథంలో రాష్ట్రం పరుగులు పెడుతోందన్నారు. ప్రజల ఆశీర్వాద బలం, ప్రజా ప్రతినిధుల నిరంతర కృషి, ప్రభుత్వ సిబ్బంది అంకితభావం వల్ల తెలంగాణ రాష్ట్రం అపూర్వ విజయాలు సొంతం చేసుకుంటోందన్నారు. ఇంటింటా నల్లాలతో స్వచ్ఛమైన తాగునీటిని 100 శాతం గ్రామాలకు సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. గొర్రెల పెంపకంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. 12.01 శాతం ఉత్పత్తి రంగ వృద్ధిరేటుతో పారిశ్రామిక ప్రగతిలో అగ్రగామిగా తెలంగాణ నిలిచిందని వివరించారు. ఐటి రంగ ఎగుమతుల్లో దేశంలోనే అత్యధికంగా 26.14 శాతం వృద్ధిరేటుతో అప్రతిహతంగా దూసుకుపోతున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. 'తెలంగాణకు హరితహారం' పథకం సాధించిన ఫలితాలతో రాష్ట్రం ఎటు చూసినా ఆకుపచ్చదనంతో అలరారుతోందని చెప్పారు. ఎనిమిదేళ్ల స్వల్ప వ్యవధిలో తెలంగాణ అత్యంత బలమైన ఆర్థికశక్తిగా ఎదిగిందని చెప్పారు. రాష్ట్రం అవతరించిన మొదటి సంవత్సరం 2014-15లో రాష్ట్ర ఆదాయం రూ. 62 వేల కోట్ల రూపాయలు ఉంటే.. 2021 నాటికి 1 లక్షా 84 వేల కోట్ల రూపాయలకు పెంచుకోగలిగామని చెప్పారు. ఏడేండ్లలోనే తెలంగాణ రాష్ట్ర రాబడి మూడు రెట్లు పెరిగిందన్నారు. నేడు దేశంలోనే బలమైన ఆర్థిక సంపత్తి

2వ



# కృష్ణయ్య హత్య వెనక సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం

- సిపిఎం నేతలను అరెస్ట్ చేసి శిక్షించాలి
- భార్య, కూతరు ఆరోపణలు
- గ్రామంలో 144 సెక్షన్ విధింపు



**ఖమ్మం, ఆగస్ట్15 (సమ సమాజం):** ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామ సమీపంలో టీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడు తమ్మినేని కృష్ణయ్య దారుణ హత్యతో తెల్దారుపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే తన భర్త హత్య వెనక సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆ పార్టీ నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు హస్తం ఉందని తమ్మినేని కృష్ణయ్య భార్య ఎంపీటీసీ మంగతాయారు, కూతురు రజిత ఆరోపించారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి..

2వ

# మంత్రి జగదీశ్ రెడ్డి అక్రమాలు బయటపెడుతా

- మునుగోడు అభివృద్ధి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా
- 21 లక్షమందితో అమిత్‌షా బహిరంగ సభ: రాజగోపాల్



**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్15 (సమ సమాజం):** మునుగోడు అసెంబ్లీలో మూడు సంవత్సరాలు నియోజకవర్గ సమస్యలపై మాట్లాడినా స్పందించని సీఎం కేసీఆర్ నేడు ఉప ఎన్నికల భయంతో మునుగోడులో అబి ,వృద్ధి పనుల గురించి ఆలోచిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపా ల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన మీడియా

2వ

# డీజీపీ మహేందర్ రెడ్డికి కరోనా



**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి కరోనా బారిన పడ్డారు. డీజీపీకి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన నేపథ్యంలో గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆయన హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల బందోబస్తును ఏడీజీ జితేందర్ పర్యవేక్షించారు.

# వీరుల పోరాటంతోనే దేశ విముక్తి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** పరాయి పాలన నుంచి విముక్తి కోసం ఎంతోమంతి వీరులు పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి

2వ

# కాంగ్రెస్‌ను వీడి చరిత్రహీనులు కావద్దు: రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ వీడి చరిత్రహీనులుగా మారొద్దని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోరారు. పార్టీ ఫిరాయింపులకు తెలంగాణను కేసీఆర్ ప్రయోగశాలగా మార్చారని విమర్శించారు. మునుగోడులో సర్పంచులు, ఎంపీటీసీ లను కొనుగోలు

2వ

# అంతరిక్షం నుంచి భారత త్రివర్ణ పతాక

ట్విట్టర్‌లో షేర్ చేసిన వ్యోమగామి రాజాచారి

**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** భారతదేశ వ్యాప్తంగా వైభవంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. అయితే అమెరికాలోని ప్రముఖ టెస్ట్ పైలట్, వ్యోమగామి రాజాచారి.. ఓ త్రివర్ణపతాక ఫొటోను

3వ

## సంపాదకీయం

# రాజకీయ అవినీతి.. దేశానికి పట్టిన అతిపెద్ద చీడ !

దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా భారత 75వ స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మువన్నెల జెండా రెపరెపలాడింది. ఆకాశాన్ని ముదాడుతుందా అన్న రీతిలో త్రివర్ణ పతకాలు ఎగురవేశారు. ప్రజలంతా తమవంతుగా దేశభక్తిని చాటారు. నేతలు కూడా జెండాలు ఆవిష్కరించారు. ఊరేవాడా త్రివర్ణపతాకం ఎగిరింది. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొని ఐక్యతను చాటారు. మనమంతా ఒక్కటే అని చాటారు. ఇదే సందర్భంలో మనం మనదేశ పురోగతిపై మననం చేసుకోవాలి. నెహ్రూ నుంచి నేటి వరకు మన స్వతంత్ర భారతావనిలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఇప్పటికీ ఎదురవుతూనే ఉన్నాయి. ప్రధానంగా ఉగ్రవాదం, నిరుద్యోగం,మాదకద్రవ్యాల వాడకం పెచ్చుమీరాయి. ఉగ్రవాదులు విదేశీ గడ్డపై నుంచి సవాళ్లు విసురుతున్నారు. దేశ విభజనతో ప్రత్యేక దేశంగా ఏర్పడ్డ పాకిస్తాన్ తన కుత్సిత బుద్ధితే తన దేశంలో ఉగ్రవాద ఫ్యాక్టరీని పెట్టి సవాళ్లు విసురుతోంది. దీంతో ఎంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతు న్నారు. సరిహద్దుల రక్షణలో జవాన్లు అమరులవుతున్నారు. ఈ సవాళ్లను అధిగమించేలా ప్రజలను చైతన్యం చేసేలా పాలకులు సంకల్పం తీసుకోవాలి. ప్రధానంగా రాజకీయ అవినీతి ప్రజాస్వామ్యానికి పట్టిన చీడగా గుర్తించాలి. పాలకులు ప్రజాస్వామ్యాన్ని ప్రైవేట్ వ్యాపారంగా మార్చారు. ఇడి కేసులంటే వేధింపు లుగా చూపుతూ తమ డొల్లతనాన్ని చాటుకుంటున్నారు. విచారణలను రాజకీయ కక్షలుగా చూపుతున్నారు. ఇటీవల బెంగాల్లో మంత్రి పార్థాఛటర్జీ కేసు తీసుకుంటే అవినీతి ఎంతగా వేళ్లూనుకుందో గుర్తించాలి. నీతులు వల్లిలంచే మమతా బెనర్జీ, శరద్ పవార్, కాంగ్రెస్ నేతల లాంటి వారు అవినీతికి కొమ్ముకాశారు. ఆకలి, దరిద్రం, మందుల కొరత, ఆహరాధాన్యాల ధరలు, ప్రజలను పట్టిపీడిస్తున్నా..పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా రాజకీయాలు నడుపుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసలైన శక్తిసామర్థ్యాలను గుర్తించ డంలో ప్రపంచానికి భారత్ తోడ్పాటును అందించి సత్తా చాటుతున్న వేళ దేశంలో ఉన్న సమస్యలను గుర్తించాలి. అణగారిన వర్గాలు, పేదలు, అవసరాల్లో ఉన్నవారి పట్ల దయార్థ్ర హృదయంతో ముందుకు సాగాల్సి ఉంది. ఈ దేశ సంపద ఏ కొందరిదో కాకుండా..అందరిదీ అన్న సంకల్పం చాటాలి. ఆర్థిక సంస్కరణలతోపాటు వినూత్న ప్రజా సంక్షేమ పథకాలతో దేశం ముందడుగు వేస్తోందని చెప్పుకుంటున్న పాలకుల అవి ఏ మేరకు ప్రజలకు మేలు చేస్తున్నాయో విశ్లేషంచుకోవాల్సి ఉంది. సమున్నతంగా ఎదుగు తున్న నూతన భారత్‌ను ప్రపంచం కీర్తిస్తోంది. దీనిని కాదనలేం. కానీ ఇదే సందర్భంలో దేశాన్ని పట్టి పీడుస్తున్న అనేకానేక సమస్యల పై పోరాటంలో పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. కరోనా మహమ్మారి తర్వాత ఈ పరిణామం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కరోనా సృష్టించిన విషవలయంలో చిక్కుకున్న ప్రజలు అనేకానేక సమస్యలతో సతమతమవుతున్నారు. పేదరికం, నిరక్షరాస్యత తాండవిస్తున్నది. ప్రజాస్వామ్యం వర్థిల్లుతోంది... దినదిన ప్రవర్థమానమవుతోంది... అని ప్రకటించుకోవడం కాదు..ప్రజలు ఏ మేరకు దానిని పొందగలుగుతున్నారన్నదే ముఖ్యం. దేశ భద్రత, ప్రగతి, సౌభాగ్యం కోసం ప్రజలు సర్వశక్తులూ ధారపోస్తున్నారు. అయితే ప్రాంతీయ అసమానతలను తగ్గించడంతోపాటు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలకులు తీసుకుంటున్న చర్యలు అంతగా ప్రతిఫలించడం లేదు. కరోనా మహమ్మారిపై భారత్ సాగించిన పోరాటాన్ని ప్రపంచమంతా హర్షించింది. మానవ చరిత్రలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని మనం చేపట్టాం. కరోనా టీకాలను దేశీయంగానే తయారు చేసుకున్నాం. టీకా డోసుల పంపిణీలో 200 కోట్ల మార్కును గత నెలలోనే దాటేశాం. మహమ్మారిని నియంత్రించే విషయంలో అభివృద్ధి చెందిన కొన్ని దేశాల కంటే భారత్ గొప్ప విజయాలు సాధించింది. అలాగే వ్యాక్సిన్‌ను పేద దేశాలకు కూడా పంపిణీ చేశాం. కాదనలేం. కరోనాను తరిమికొట్టడంలో ఎవరికి వారు కృషి చేశారు. కొత్తగా ఎదురైన సవాళ్లను అధిగమించాం. ఇందుకు మన సైంటిస్టులు, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేయాలి. కరోనా వైరస్ ఎందరో జీవితాలను బలితీసుకుంది.ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసింది. అలాగే మన ఆర్థిక వ్యవస్థ కూడా అతలాకుతలం అయ్యింది. ఈ సంక్షోభం వల్ల తలెత్తిన పరిణామాలతో ఎన్నో దేశాలు సతమతమయ్యాయి. భారత్ వేగంగా కోలుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగే ప్రయత్నాల్లో ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటిగా ఉందన్న కితాబులతో ఉప్పొంగి పోకుండా క్షేత్రస్థాయి పరిశీలనలతో ప్రజల సమస్య లను పరిష్కరించే సత్తా చూపాల్సిన బాధ్యత పాలకులదే. అప్పుడే మన మనుగడకు అర్థం కలుగుతుంది. మన దేశంలో స్టార్టప్ కంపెనీలు మంచి విజయం సాధిస్తున్నా.. యూనికార్న్ కంపెనీల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా..ఉపాధి, ఉద్యోగ రంగాల్లో దారుణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇది దేశాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్యగా చూడాలి. మన ఆర్థిక వ్యవస్థ బలపడడానికి స్టార్టప్ కంపెనీలు దోహదపడు తున్నాయని చెప్పుకుంటున్నా..ఉద్యోగ కల్పన మాత్రం కానరావడం లేదు. మనం సాధిస్తున్న అభివృద్ధి ఖచ్చింతంగా పేదలకు చేరాలి. అప్పుడే మనం అభివృద్ధి సాధించినట్లు చెప్పుకోవాలి. దీర్ఘకాలంలో ఉపయోగ పడేలా ఆర్థిక సంస్కరణలు చేపట్టాలి. విధాన నిర్ణయాలు అమలు చేయాలి. ఆర్థిక విజయం ప్రజల జీవితాలను సులభతరం చేసేలా ఉండాలి. పేదలకు సొంతిల్లు అనేది ఇంకా కలగానే మిగిలి పోయింది. స్వత్రంత్రగా ఇల్లు కట్టుకునే పరిస్తితి లేదు. పెరిగిన ధరలు సామాన్యులను, మధ్యతరగతి ప్రజల ను సొంతింటి కలకు దూరం చేస్తోంది.మనం స్వేచ్ఛగా జీవించేందుకు ఎంతోమంది మహనీయులు ఎన్నో త్యాగాలు చేశారు. వారిని స్మరించుకోవాల్సిన సందర్భం ఇది. వారి త్యాగాలను కేవలం కొందరే అనుభవిం చడం అభివృద్ధి కాదు. ముఖ్యంగా మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నా..వారికి రక్షణ లేకుండా పోయింది. నిర్భయంగా వారు బజారులో తిరిగే పరిస్థితి లేదు. ఈ సమస్యలను ఆకళింపు చేసుకుని విధానాలు రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తూ పోతేనే మనం సమగ్రాభివృద్ధి సాధించగలం. మన భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలదు. పేదల ఈతిబాధలు తొలగిపోగలవు. ఇందుకోసం పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాల్సి ఉంది.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# దేశ నిర్మాణంలో ఆర్థిక శక్తిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి..)కలిగిన రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. గత ఏడేండ్లుగా రాష్ట్ర స్వంత పన్నుల ఆదాయం (ఎస్.ఓ.టి.ఆర్)లో 11.5 శాతం వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని, ఇదే విషయాన్ని కంఎ÷-టోల్రర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక వెల్లడించిందని తెలిపారు. ఇది మన రాష్ట్రానికి గర్వకారణమని, ఆషామాషీగానో, అయాచితంగానో ఈ పెరుగుదల రాలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాటించిన ఆర్థిక క్రమశిక్షణ, అడుగడుగునా ప్రదర్శించిన పారదర్శకత, అవినీతిరహిత పరిపాలన వల్లనే రాష్ట్ర ఆదాయ వనరుల్లో అనూహ్యమైన పెరుగుదల సాధ్యమైంది చెప్పారు. 2014, 15లో రాష్ట్రం ఏర్పడిన నాడు రాష్ట్ర జీ.ఎస్.డి.పి. 5 లక్షల 5 వేల 849 కోట్ల రూపాయలు కాగా, 2021-22 నాటికి 11 లక్షల 48 వేల 115 కోట్ల రూపాయలకు చేరిందని చెప్పారు. గత ఏడేండ్లలో రాష్ట్ర జి.ఎస్.డి.పి 127 శాతం పెరిగిందని, అదే సమయంలో దేశ జీడీపీ 90 శాతం మాత్రమే





పెరిగిందన్నారు. తెలంగాణ వృద్ధి రేటు భారతదేశ వృద్ధిరేటుకంటే 27 శాతం అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన అద్భుత ప్రగతికి ఇది ప్రబల నిదర్శనమని చెప్పారు. 2013, 14లో సుమారు 1 లక్ష రూపాయలు మాత్రమే ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వ కృషి వల్ల 2021, 22 నాటికి 2 లక్షల 75 వేల రూపాయలకు పెరిగిందని సీఎం కేసీఆర్ చెప్పారు. ప్రస్తుత జాతీయ తలసరి ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయల కంటే రాష్ట్ర తలసరి ఆదాయం 84 శాతం అధికంగా ఉండటంగర్వించాల్సిన విషయమని చెప్పారు. జాతీయ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం అంతకంతకూ పెరుగుతూనే ఉందని, ఇది శుభపరిణామం అని అన్నారు. గత ఏడేండ్లలో వ్యవసాయం దాని అనుబంధ రంగాల పరిమాణం రెండున్నర రెట్లు పెరిగిందని, అదే సమయంలో పారిశ్రామిక రంగం 2 రెట్లు, సేవా రంగం 2. 2 రెట్లు పెరిగాయన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లోనూ అభివృద్ధి గతం కన్నా రెట్టింపు స్థాయిలో సాగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల మీద, వ్యవసాయ రంగం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో అత్యధిక అభివృద్ధి సాధ్యమైందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా, ఉత్తేజంగా నిర్వహించుకుంటున్న తెలంగాణ ప్రజలకు, యావత్ భారతజాతికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి భారతీయుని హృదయం ఉప్పొంగిపోయే విశిష్ట సందర్భమిది అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిందన్నారు. 1 కోటి 20 లక్షల జెండాలను రాష్ట్ర ప్రభుత్వమే తెలంగాణ కార్మికుల చేతులతోనే తయారు చేయించి ఇంటింటికీ ఉచితంగా అందజేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుకు తెలంగాణ ప్రజానీకం ప్రతి ఇంటిపై జాతీయ పతాకాలను ఎగరేయటంతో యావత్ రాష్ట్రం త్రివర్ణశోభితమై మెరిసి.. మురిసి పోతుందని అన్నారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా దేశం స్వేచ్ఛా వాయువులను పీల్చుకోవడం కోసం తమ ప్రాణాలను ధారపోసిన మహనీయుల త్యాగాలను ఘనంగా స్మరించుకోవటం అందరి బాధ్యత అని సీఎం కేసీఆర్ అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను, ఆదర్శాలను, విలువలను నేటితరానికి తెలియ జేయాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను నిర్వహిస్తోందని, ఈనెల 22వ తేదీ వరకు దేశభక్తిని చాటే అనేక కార్యక్రమాలను రాష్ట్రమంతటా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఎందరో మహనీయుల త్యాగఫలంతో ఇవాళ మనమందరం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, నవభారత నిర్మాణంలోనూ మహోన్నతమైన పాత్ర పోషించిన తొలిప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్, మహోన్నత తాత్వికుడు, సంస్కర్త, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనుభావుల సేవలు చిరస్మరణీయం అని గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్య సముపార్జన కోసం దేశమంతటా జరిగిన పోరాటంలో తెలంగాణ వీరులు ఉజ్వలమైన పాత్రను పోషించారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. తుర్రేబాజ్ ఖాన్, రాంజీ గోండు, మౌల్వీ అలావుద్దీన్, భారత కోకిల సరోజినీ నాయుడు, సంగెం లక్ష్మీబాయి, రామానంద తీర్థ, పీవీ నర్సింహారావు మొదలైన వారు సాహసోపేతంగా చేసిన పోరాటం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు.



# అవినీతి, వారసత్వ రాజకీయాలపై పోరాడుదాం

(మొదటి పేజీ తరువాయి..)



దృష్టిసారించాలన్నారు. అభివృద్ధి చెందిన భారతం, .బానిసత్వం నిర్మూలన, 3ఘనమైన వారసత్వం, 4ఏకత్వం, .పౌరబాధ్యత ఇవే మన పంచప్రాణాలు అన్నారు. పంచప్రాణాల మార్గదర్శనంలో వచ్చే 25 ఏళ్లు సమష్టిగా పనిచేద్దాం అని అన్నారు. 130 కోట్ల మంది సంకల్పంతో ఇది సాధ్యమవుతుంది. 130 కోట్ల మంది ఒక అడుగు ముందుకు వేస్తే.. దేశం 130 కోట్ల అడుగులు ముందుకు వేస్తుందన్నారు. ప్రతిభ ఉన్నవారికే అవకాశాలు ఇవ్వాలని మోదీ అన్నారు. నూతన భారతదేశానికి ప్రతిభ మాత్రమే ఆధారమని బంధుప్రీతి, వారసత్వాల గురించి నేను మాట్లాడితే రాజకీయం గురించి ప్రస్తావిస్తున్నా అని అనుకుంటారు. కానీ, దురదృష్టవశాత్తు ఈ కుటుంబ రాజకీయాలే ప్రతిరంగంలో బంధుప్రీతిని పెంచి పోషించాయి. వీటన్నింటిని మార్చాలంటే ప్రతిభ ఉన్నవారికే అవకాశాలు రావాలి. ఎవరైతే అర్హులు ఉంటారో వారికే అవకాశాలు దక్కాలన్నారు. రోవైపు, అవినీతిపైనా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవినీతిని ప్రచారం చేసేవారిని శిక్షించాలని అన్నారు. అవినీతిని చూసి దేశం ఏర్పడుతుంది. ఐక్య భారతంలో లింగసమానత్వం కీలక అంశం. కుటుంబాలలో కుమారులు, కుమార్తెలకు సమాన ప్రాధాన్యం ఇవ్వకపోతే.. ఐక్యత అనే ఆలోచనే ప్రమాదంలో పడుతుంది. ఇంట్లోనూ ఐక్యభావంతో మెలగాలి. అన్ని స్థాయిలలో వివక్ష పూర్తిగా సమసిపోవాలని మోదీ అన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్



కోపగించుకుంటోంది తప్ప అవినీతిపరులను కాదు. ఈ తీరు మారాలి. అవినీతి చేసిన వ్యక్తులనూ శిక్షించాలన్న భావన ఏర్పడి తేనే దేశం వేగంగా పురోగతి సాధిస్తుంది. మన సత్తా అంతా కూడగట్టుకొని అవినీతిపై పోరాడాలన్నారు. ఈ విషయంలో మేం సఫలమయ్యాం. ఆధార్, ప్రత్యక్ష నగదు బదిలీ, మొబైల్ ఫోన్లు ఉపయోగించి గడిచిన ఎనిమిదేళ్లలో రూ.2లక్షల కోట్ల నల్లధనాన్ని గుర్తించాం' అని మోదీ పేర్కొన్నారు. మహిళలను అందరూ గౌరవించాలని మోదీ దేశ ప్రజలకు సూచించారు. ఏ ఒక్కరూ మహిళల గౌరవం భంగం కలిగేలా ప్రవర్తించ కూడదని హితవు పలికారు. 'నారీ శక్తి'కి ప్రజలంతా మద్దతు పలకాలని అన్నారు. మహిళలను అవమానిం చడం సబబేనన్న ప్రవర్తన నుంచి బయటపడాలని స్పష్టం చేశారు. ఇందుకోసం అందరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. ఐక్యభారతం ప్రపంచానికి చాలా నేర్పించాల్సిన అవసరం ఉంది. కుటుంబ నిర్మాణం నుంచే జాతి ఐక్యత అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఇందుకోసం దేశప్రజలకు ఐదు సూత్రాలు బోధించారు. వీటిపైనే వచ్చే 25 ఏళ్ల పాటు పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చి, బానిసత్వం జాడలను సమూలంగా తొలగించేందుకు దేశప్రజలంతా కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు. మంగళ్ పాండే, రాజ్ గురు, తాంతీయ తోపే, అష్ఫాకుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మల్, భగత్ సింగ్, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు వంటి వాళ్లు ఆంగ్లేయ పాలకులకు దడ పుట్టించారు. రాణి లక్ష్మీబాయి, బేగం హజ్రత్ మహల్ భారత నారీ శక్తి సంకల్పం ఎలా ఉంటుందనేది ప్రపంచానికి చూపించారు. వీరందరినీ గుర్తు చేసుకున్నప్పుడల్లా ప్రతి భారతీయుడు గర్వంతో ఉప్పొంగుతాడని మోదీ చెప్పారు. దేశపు మట్టిపై ఉన్న ప్రేమతో స్వాతంత్ర్య సమర యోధులు వీరోచిత పోరాటం చేసి.. మనకు స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత్ కు ఉన్న గొప్ప మహత్తర శక్తి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి మాతృక భారతదేశమన్నారు. 75 ఏళ్లలో మన దేశం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్పంతో మేం ముందుకు కదులుతున్నాం. తిరంగా యాత్రల ద్వారా యావత్ దేశం ఏకతాటిపైకి వచ్చింది. దేశాన్ని ఏకం చేసే మహత్తర శక్తి మువ్వన్నెల జెండాకు ఉందని ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు నిరూపిం చాయి. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అని మేం పిలుపునిస్తే.. 'సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్' ద్వారా దేశ ప్రజలంతా మా ప్రయత్నంలో భాగస్తులయ్యారని మోదీ అన్నారు.వచ్చే 25 ఏళ్లలో దేశ ప్రజలు 5 అంశాలపై ప్రధాన దృష్టిపెట్టాలి. 2047 సంవత్సరంకల్లా దేశ స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకు కదలాలి. ఆ ఐదు అంశాల్లో మొదటిది.. అభివృద్ధిచెందిన దేశంగా భారత్ ను నిలపడం. రెండోది.. దేశంలో ఇంకా ఎక్కడైనా కొంచెం బానిసత్వం ఉన్నా నిర్మూలించాలి. మూడోది.. దేశ చరిత్ర, స్వతంత్ర పోరాట యోధుల త్యాగాలపై గౌరవం ఉండాలి. నాలుగోది.. ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి. ఐదోది.. దేశం కోసం దేశ లక్ష్యాల కోసం కృషిచేయాలనే వజ్ర సంకల్పం మనలో ఉండాలి అని మోదీ చెప్పారు. ప్రస్తుతం 25 ఏళ్ల వయసు ఉన్న యువత.. మరో 25 ఏళ్ల తర్వాత 50 ఏళ్లకు చేరుతారు. అప్పటిలోగా మన భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే సంకల్పంతో యువత పురోగమించాలని మోడీ పిలుపునిచ్చారు. మనం ఏది చేసినా.. 'ఇండియా ఫస్ట్' దృక్పథంతో చేయాలి. అప్పుడే దేశంలో, దేశ ప్రజల్లో ఐకమత్య భావన ఏర్పడుతుంది. స్త్రీ, పురుష సమానత్వం లేనిదే.. సమానత్వ భావనకు పరిపూర్ణత చేకూరదని ఆయన తెలిపారు. మహిళలను గౌరవించడం అనేది నవ భారత కలలను సాకారం చేసేందుకు పునాదిగా మారుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# కృష్ణయ్య హత్య వెనక సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం





(మొదటి పేజీ తరువాయి..)కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలోనే తన భర్తను హత్య చేస్తానని కోటేశ్వరరావు పలుమార్లు బెదిరిస్తూ వచ్చారన్నారు. గ్రామంలో తన భర్తకు రాజకీయంగా మంచి పేరు ఉండటంతో కోటేశ్వరరావు చంపాలని ప్లాన్ వేశారన్నారు. తమ్మినేని వీరభద్రంతో పాటు కోటేశ్వరరావును హత్యతో సంబంధం ఉన్న సీపీఎం నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి వచ్చిన పరిస్థితి భవిష్యత్తులో ఏ కుంటుంబానికి రావద్దని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలావుంటే ఖమ్మం రూరల్ మండలంలో ఆగష్టు 16 వరకు 144 సెక్షన్ అమలుకు నిర్ణయించారు. ఆగష్టు 16 వరకు ఖమ్మం రూరల్ మండలంలో 144 సెక్షన్ అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారుఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి లో తమ్మినేని కృష్ణయ్య హత్య ఘటన నేపథ్యంలో హత్య జరిగిన ప్రదేశాన్ని పోలీస్ కమిషనర్ సందర్శించారు. ఆగష్టు 16 సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ ఆంక్షలు అమలుల్లో వున్నందున ఎలాంటి సభలు, ర్యాలీలకు, సమావేశాలు నిర్వహించరాదని, గుంపులుగా తిరగడం నిషేధమని తెలిపారు. నిషేధం వున్న నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. గ్రామంలో ఇప్పటికే అధికారుల పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హత్య కేసులోని దుండగుల కోసం నాలుగు పోలీస్ బృందాలు గాలింపు..చేపట్టిన తెలిపారు.నిందుతులను పట్టుకొని చట్టం ముందు నిలబెడుతామని, క్షేత్రస్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

# వీరుల పోరాటంతోనే దేశ విముక్తి

(మొదటి పేజీ తరువాయి..)మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. స్వాతంత్య పోరాట యోధులను స్మరిస్తూ యువతలో దేశభక్తి, జాతీయ సమైఖ్యతా భావాలు పెంపొందే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాలను ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిన తరువాత మహబూబాబాద్ ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసుకున్నాం. జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందని ఆమె పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడి చరిత్రహీనులు కావద్దు: రేవంత్

(మొదటి పేజీ తరువాయి..)చేస్తున్నారని ఆరోపించారు. కోవిడ్ కారణంగా మునుగోడులో పర్యటించలేకపోతున్నానని, ఈనెల 20వ తేదీ నుంచి మునుగోడులోనే ఉంటానన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు పార్టీ మారొద్దని కోరారు. సంవత్సరం ఓపిక పడితే.. కాంగ్రెస్‌దే అధికారమన్నారు. మునుగోడు ఉప ఎన్నిక తెలంగాణ భవిష్యత్‌ను దిశానిర్దేశర చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన టైం వచ్చింది.

# మంత్రి జగదీశ్ రెడ్డి అక్రమాలు బయటపెడుతా

(మొదటి పేజీ తరువాయి..)సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న లక్ష మందితో మునుగోడులో అమిత్ షా బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నాం. అమిత్ షా మీటింగ్‌కు భయపడే, కేసీఆర్ 20వ తేదీన బహిరంగ సభ పెట్టుకున్నాడు. నా పదవీ త్యాగంతో మునుగోడు అభివృద్ధి చెందుతుంది. మంత్రి జగదీష్ రెడ్డి నేను అమ్ముడుపోయిన అని మాట్లాడుతున్నాడు. అది ఆయన రుజువు చేస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా.. లేకపోతే నీవు మంత్రి పదవికి రాజీనామా చేస్తావా అని సవాల్ విసిరారు. మంత్రి జగదీష్ రెడ్డి నాగారం, తుంగతుర్తి మర్డర్ కేసులలో ఎ1, ఎ2 నిందితుడిగా ఉన్నారు. నేరచరిత్ర కలిగిన మనిషి ఈ జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి. తెలంగాణ రాక ముందు జగదీష్ రెడ్డి ఆస్తులు ఎన్ని? ఇప్పుడున్న ఆస్తులు ఎన్ని?. మొత్తం బయటకు తీస్తా. త్వరలోనే అక్రమాస్తుల చిట్టా బయటపెడతా. మునుగోడులో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పు ఉంటుంది' అని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# బండి సంజయ్‌పై దాడి దారుణం

## ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం



**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** దేవరుప్పులలో బండి సంజయ్ ప్రజా సంగ్రామయాత్ర సందర్భంగా కార్యకర్తలపై జరిగిన దాడి ఘటనను బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. బిజెపికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక దాడి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఈటెల రాజేందర్,రఘునందర్ రావు, రాజాసింగ్ వివేక్ వెంకట స్వామి తదితరులు తీవ్రంగా ఖండించారు. పాదయాత్ర కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీఆర్ఎస్ గూండాలు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ కావాలనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. టీఆర్ఎస్ నాయకుల ఆటలు ఇక సాగవని..రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారించే ఉద్దేశంతోనే సంజయ్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. మూడో విడత యాత్ర దిగ్విజయంగా సాగుతుండటంతో కేసీఆర్ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో ప్రతిపక్షాలు లేకుండా చేసే ప్రయత్నంలో భాగంగా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

## టిఆర్ఎస్ నేతల కాళ్లకింద భూమి కదులుతోంది

బండి సంజయ్‌పై దాడిపట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** టీఆర్ఎస్ నేతల కాళ్ల కింద భూమి కదులుతున్నందునే ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దాడులు మంచివి కావన్న ఆయన.. ఎన్ని దాడులు చేసినా, ఎంత డబ్బు ఖర్చు పెట్టినా కేసీఆర్ కుటుంబ పాలనను ప్రజలు అంతం చేస్తారని అన్నారు. రాష్ట్ర పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాదయాత్ర చేస్తుంటే శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత వారికి లేదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ నడుస్తోందన్న కిషన్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీ మరో ఐదారు నెలలు మాత్రమే ఉంటుందని అన్నారు. ఆరు నెలల్లో తెలంగాణలో అసలైన ప్రజాస్వామ్య ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుంటే చేతకాని టీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్‌పై దాడి చేశారని ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడ్డారు. మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు దేనికీ పనికిరాడని విమర్శించారు. బండి సంజయ్‌పై దాడులతో కుట్ర చేస్తే ఆయన అగుతారా? అని ప్రశ్నించారు. పోలీసులకు తెలిసే దాడి జరిగిందని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఏం జరుగుతుందో పోలీసులు ఆలోచించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇదే పని చేస్తే మీ ఎమ్మెల్యేలు తిరగగలరా? అని ఆయన ప్రశ్నించారు.

## అంతరిక్షం నుంచి భారత త్రివర్ణ పతాక

(మొదటి పేజీ తరువాయి..)ట్విటర్‌లో షేర్ చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. భారత నౌకాదళం ఆరు ఖండాలకు నౌకలను పంపి వేడుకలను నిర్వహించగా.. వివిధ దేశాల్లో ఉన్న భారత సంతతి వ్యక్తులు ఉత్సాహంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా అమెరికాలోని ప్రముఖ టెస్ట్ పైలట్, వ్యోమగామి రాజాచారి ఆసక్తికర ఫొటోలు ట్వీట్ చేశారు.

# ఆత్మనిర్భర భారత్ వైపు పురోగమిద్దాం

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు



**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** ఆత్మ నిర్భర భారత్ వైపు పురోగమిద్దామని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు. వెంకయ్యనాయుడు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని తన నివాసంలో భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తమ నివాసంలో జాతీయ జెండాను ఎగురవేయడం ఎంతో ఆనందాన్ని అందించింది. భారత జాతిని సంఘటితం చేయగల ప్రేరణాత్మక శక్తి... మన మువ్వన్నెల జెండా అని పేర్కొన్నారు. స్వరాజ్యం సముపార్జించుకుని 75 ఏళ్ళు గడిచిన నేపథ్యంలో స్వాతంత్య్ర అమృతోత్సవాల పేరిట నాటి స్వరాజ్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ రోజు స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోవడం ముదావహమన్నారు. ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మన జాతీయ విలువైన ఏకత్వం, సామరస్యం, సార్వత్రిక సౌభ్రాతృత్వాలను మన ఆచరణ ప్రతిబింబించాలన్నారు. ఈ శుభ సందర్భంలో మన స్వతంత్ర సమరయోధులను స్మరించుకుందామని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వారు కలలుగన్న నవభారతాన్ని నిర్మించుకునేందుకు కంకణబద్ధులమవుదామన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో సాధించిన విజయాలను, ప్రగతిని చూసి గర్విస్తూ పేదరికం, నిరక్షరాస్యత, సాంఘిక అసమానతలు, లింగ వివక్ష, అవినీతి వంటి సవాళ్ళను సమైక్యంగా కలిసి కట్టుగా ఎదుర్కొందామన్నారు.

# సానుభూతి పొందేందుకే దాడి డ్రామాలు

## బండిపై ఎదురుదాడి చేసిన మంత్రి ఎర్రబెల్లి



**జనగామ, ఆగస్టు 15(సమ సమాజం):** ప్రజల్లో సానుభూతి పొందేందుకే బీజేపీ దాడులకు పాల్పడుతోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. జిల్లాలోని దేవరుప్పులలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బీజేపీ, టీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడిలో గాయపడి జనగామ హాస్పిటల్ లో చికిత్స పొందుతనున్న టీఆర్ఎస్ కార్యకర్తలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. అనంతరం బీజేపీ దాడిని ఖండించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... యాత్ర పేరుతో టీఆర్ఎస్ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలపై బండి సంజయ్ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్య దినోత్సవం రోజే ఇలా జరగడం బాధాకరమన్నారు. దాదాపు 500 మంది గూండాలతో బండి సంజయ్ దేవరుప్పులకు వచ్చారన్నారు. కేసీఆర్, కేటీఆర్ తో పాటు తనపై కూడా బండి సంజయ్ ఇష్టమొచ్చినట్లు దుర్భాష లాడారని, ఈ క్రమంలోనే అక్కడున్న కొంత మంది అలా తిట్టొద్దని బండి సంజయ్ కు సూచించారన్నారు. దీంతో రెచ్చిపోయిన బీజేపీ గూండాలు కర్రలు, రాడ్స్, రాళ్ల తో విచక్షణ రహితంగా దాడులు చేశారన్నారు. ఈ ఘటనతో బీజేపీ వైఖరి అర్థమైందన్నారు. ఘటనపై విచారణకు ఆదేశించామన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు... బీజేపీ దాడులను తిప్పికొడతామని హెచ్చరించారు.

# కార్యాలయంలో జెండా ఎగురేసిన మంత్రి వేముల



**నిజామాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** 76 వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా.. రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అవిశ్రాంతంగా పోరాడటంతోపాటు ప్రాణాలు కోల్పోయిన మహనీయుల త్యాగం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో జాతీయ జెండా పట్ల గౌరవాన్ని ప్రదర్శించడం మనందరి కర్తవ్యమని అన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఏసీసీ ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఎనిమిదేళ్లలో ఎంతో ప్రగతి

కెసిఆర్ సంకల్పంతో వ్యవసాయాభివృద్ధి

సిద్దిపేటలో జెండా ఆవిష్కరించిన మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, ఆగస్టు 15(సమ సమాజం):** 70 ఏండ్లలో సాధించని అభివృద్ధిని ఏనిమిదేండ్లలో తెలంగాణ సాధించిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో 75వ స్వాతంత్య దినోత్సవ వజ్రోత్సవాల వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వ్యవసాయం పండుగగా మారిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రైతులకు రైతు బంధు, బీమా ఇస్తున్నాం.సిద్దిపేట జిల్లాలో ఐదు వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టామన్నారు. నంగునూర్ మండలం రూ.300 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. సిద్దిపేట జిల్లా ప్రాజెక్ట్ ల ఖిల్లాగా మారిందన్నారు. కరువు నుండి కల్పతురువు జిల్లాగా మార్చుకున్నామన్నారు. కాళేశ్వరం నీళ్లు రావడంతో, రైతులకు కన్నీళ్లు పోయాయి. నాటి భగీరథుడే.. నేటి చంద్రశేఖరుడు అన్నారు. పేదలకు కార్పొరేట్ హాస్పిటల్స్ మాదిరిగానే, ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా దళితుల ప్రగతికి దళిత బంధు ఇస్తున్నాం. నిరుపేదలకు నిలువెత్తు నిదర్శం డబుల్ బెడ్రూం ఇండ్లు అని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# జాతీయ ఉద్యమ స్పూర్తితో తెలంగాణ

జెండా ఆవిష్కరణలో మంత్రి మహమ్మూద్ అలీ



**సంగారెడ్డి, ఆగస్టు 15(సమ సమాజం):** భారత జాతీయోద్యమ స్ఫూర్తితో, అహింసా మార్గంలో పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో హోం మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే 150 మందితో తరగతులు స్టార్ట్ అవుతాయని మంత్రి తెలిపారు. జిల్లాలో కొత్తగా 41,981 మందికి ఈ రోజు నుంచి ఆసరా పెన్షన్లు వస్తాయని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రాణాలు ఆర్పించిన త్యాగధనులకు నివాళులు అర్పించారు.

## వీరుల త్యాగాలను స్మరించుకుందాం

జెండా వందనంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్, ఆగస్టు 15(సమ సమాజం):** స్వాతంత్ర్య వీరుల త్యాగాలను స్మరించుకుందామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో మంత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగం వలన మనకు స్వాతంత్రం వచ్చిందని, అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వజ్రోత్సవాలను 15 రోజుల పాటు పండుగ వాతావరణం తలపించేలా నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో నిర్మల్ జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదని చెప్పడానికి గర్విస్తున్నాను. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ కె. విజయలక్ష్మి రెడ్డి, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ, ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఏఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌కు మాణిగం ఠాకూర్

మునుగోడు కోసం నెలరోజులపాటు ఇక్కడే మకాం

**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతోంది. ఇందులో భాగంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్కం ఠాగూర్ నేడు హైదరాబాద్ కు రానున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలపై చర్చించేందుకు మూడు రోజుల పాటు ఇక్కడే మకాం వేయనున్నారు. 17వ తేదీన గాంధీ భవన్‌లో పీసీసీ ముఖ్య నాయకులతో మాణిక్కం ఠాగూర్ సమావేశం కానున్నారు. మునుగోడు ఉప ఎన్నిక,పార్టీ అంతర్గత విషయాలపై చర్చించనున్నారు. అదే రోజున మునుగోడులోని 7 మండలాల ఇంఛార్జులతో ఆయన భేటీ కానున్నారు. సాయంత్రం 5గంటలకు డీసీసీ అధ్యక్షులతో సమావేశమై ఆజాదీ కా గౌరవ్ కార్యక్రమం తీరుతెన్నులను సమీక్షించనున్నారు. 18వ తేదీన కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశం కానున్న మాణిక్కం ఠాగూర్.. సాయంత్రం 4:15 గంటలకు హైదరాబాదు నుండి మధురై వెళ్లనున్నారు.

# భారత్ బయోటెక్ చుక్కల మందు టీకా

## ప్రయోగ పరీక్షలు విజయవంతంపై ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 15(సమ సమాజం):** భారత్ బయోటెక్ చుక్కల మందు టీకా విజయవంతమైంది. మూడో దశ ప్రయోగాల్లో ఫలితాలు సానుకూలంగా వచ్చినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని సంస్థ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు చేసింది. భారత్ బయోటెక్ నాసల్ వ్యాక్సిన్ బీబీవీ154 ను విజయవంతం గా అభివృద్ధి చేసింది. మూడో దశ ప్రయోగాల్లో ఫలితాలు సానుకూలంగా వచ్చినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని సంస్థ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు చేసింది. ఈ టీకా పూర్తిగా సురక్షితమైందని, వ్యాధినిరోధక శక్తిని సమర్థంగా ప్రేరేపిస్తోందని వెల్లడించింది. కొన్ని మార్పులు చేసిన అడినోవైరస్ వెక్టార్ సాయంతో ఈ టీకాను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. 'వాషింగ్టన్ యూనివర్శిటీ ఇన్ సెయింట్ లూయిస్' భాగస్వామ్యంతో ప్రత్యేకంగా అభివృద్ధి చేసినట్లు వివరించింది. ఈ టీకాను నాసికా రంధ్రాల ద్వారా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రయోగ ఫలితాలను ఔషధ నియంత్రణ సంస్థలకు అందజేసినట్లు వెల్లడించింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి దేశాలకు అతి తక్కువ వ్యయంతో టీకాను అందించాలనే లక్ష్యంతో ఈ నాసల్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు భారత్ బయోటెక్ పేర్కొంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సాయంతో భారత ప్రభుత్వం ఈ టీకా అభివృద్ధి, ప్రయోగాలకు సహకరించినట్లు వివరించింది. బీబీవీ154 టీకాను ప్రాథమిక డోస్‌గా, బూస్టర్ డోస్‌గా వినియోగించడంపై వేర్వేరుగా ప్రయోగాలను నిర్వహించారు. ఈ టీకాను 2-8 డిగ్రీల సెల్సియస్ వద్ద భద్ర పర్చి సులభంగా రవాణా చేయవచ్చు. దేశ స్వాతంత్య దినోత్సవం నాడు బీబీవీ154 టీకా విజయవంతమైందని ప్రకటించినందుకు గర్వపడుతున్నామని భారత్ బయోటెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్రా ఎల్లా పేర్కొన్నారు.




# చలన చిత్రం



## సిద్దూకు జోడీగా అనుపమ

యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డకు ఈ ఏడాది బ్రేక్ ఇచ్చిన సినిమా డీజే టిల్లు. విమల్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లను రాబట్టింది. సిద్దూ నటన, డైలాగ్ డెలివరీ యూత్‌ను ఫిదా చేసింది. ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో సిద్దూ జొన్నలగడ్డకు జోడీగా నేహా శెట్టికి బదులుగా మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరణ్ నటించనున్నట్లు తెలుస్తుంది. రౌడీ బాయ్స్ చిత్రంతో రొమాన్స్ డోస్ పెంచిన అనుపమ ఈ చిత్రానికి ఓకే చెప్పినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం అనుపమ టాలీవుడ్ బిజీ హీరోయిన్‌గా కొనసాగుతుంది. ఇప్పటికే ఆమె నిఖిల్‌తో '18పేజీస్', 'బట్టర్‌ఫ్లై అనే చిత్రల్లో నటిస్తుంది.

## నటి మీనా సంచలన నిర్ణయం

### అవయవ దానం చేస్తానని ప్రకటన



నటి మీనా సంచలన నిర్ణయం తీసుకున్నారు. అవయవ దానాన్ని ప్రోత్సహించాలని నిర్ణయాంచారు. ఈ మేరకు ముందుగా తానే అవయవ దానానికి ముందుకు వచ్చారు. ఇటీవలే భర్తను కోల్పోయిన మీనా.. కీలక ప్రకటన చేశారు. తన అవయవాలను దానం చేస్తున్నట్టు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటించారు. అవయవ దానం అనేది చాలా గొప్ప విషయమని, దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. మంచానికే పరిమితమైన వారికి అవయవదానం రెండో జీవితం లభిస్తుందని తెలిపారు. ఒక్క అవయవదాత ముందుకొస్తే ఎనిమిది మంది ప్రాణాలు నిలుస్తాయన్నారు. అవయవదానం ప్రాముఖ్యత ప్రతీ ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఇటీవలే భర్తను కోల్పోయిన మీనా..ఆలోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ.. ఆసుపత్రిలో చేరిన మీనా భర్త విద్యాసాగర్‌కు సరైన సమయంలో ఊపిరితిత్తులు దొరక్కపోవడంతో చనిపోయారు. అందుకే మీనా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అవవయదానానికి ముందుకొచ్చిన మీనాపై సర్వత్ర ప్రశంసలు కురుస్తున్నాయి. ఆరేళ్ళ వయసులోనే సినీరంగంలోకి అడుగుపెట్టిన మీనా.. ఆ తర్వాత కథానాయికగా మారిన సంగతి తెలిసిందే. ఒకప్పుడు అగ్ర కథానాయకులందరితోనూ జోడీ కట్టిన ఈ నటీమణి ఈ జెనరేషన్‌లో కూడా ప్రముఖ హీరోల సరసన కథానాయికగా నటించి మెప్పించారు.



## భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న సీతారామం




మలయాళ యంగ్ హీరో దుల్ఖర్ సల్మాన్ , అందాల మృణాళ్ ఠాకూర్ జోడీగా నటించిన ఎమోషనల్ లవ్‌స్టోరీ 'సీతారామం' అద్భుతమైన టాక్ సొంతం చేసుకొని, భారీ వసూళ్ళను నమోదు చేస్తోంది. దుల్ఖర్ సల్మాన్ మైండ్ బ్లోయింగ్ పెర్ఫార్మెన్స్, మృణాళ్ ఠాకూర్ సహజనటన, హను రాఘవపూడి దర్శకత్వ ప్రతిభ చిత్రానికి మంచి మైలేజ్ తెచ్చిపెట్టాయి. సినిమా విడుదలై 10 రోజులయింది. మొదటి రోజునుంచి ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్‌లో ప్రేక్షకులు చిత్రాన్ని విపరీతంగా ఆదరిస్తున్నారు. ఇక యూఎస్‌లో అయితే 'సీతారామం' చిత్రం సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. గత రెండు నెలల్లో విడుదలైన అనేక చిత్రాలతో పోల్చితే 'సీతారామం' భారీగానే వసూలు చేసింది. ముఖ్యంగా యూఎస్ మిలియన్ డాలర్స్‌కు పైగానే కలెక్ట్ చేసి ట్రేడ్ వర్గాల వారిని ఆశ్చర్యపరిచింది. ఈ విషయాన్ని మేకర్స్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. దుల్ఖర్ సల్మాన్, మృణాళ్ ఠాకూర్‌లది మన భాష కాదు. అయినప్పటికీ.. వారి అభినయం, కథాంశంలోని కొత్తదనం, ఎమోషన్స్ ఈ సినిమాకి బలంగా మారాయి. కొత్త సినిమాలు విడుదలైనప్పటికీ.. చిత్రం ఇంకా హౌస్ ఫుల్ షోలతో నడుస్తోంది. ఈ సినిమా లాంగ్‌రన్‌లో మరింతగా వసూళ్ళను కురిపిస్తుందని అంచనా వేస్తున్నారు. దర్శకుడు హను రాఘవపూడి ఇప్పటి వరకూ తీసిన చిత్రాలు కమర్షియల్‌గా సక్సెస్ కాకపోవడంతో.. అతడి కెరీర్ డైలమాలో పడింది. అలాంటి పరిస్థితుల్లో స్టాం÷-రగ్ కంటెంట్‌తో 'సీతారామం' చిత్రాన్ని తెరకెక్కించి ఎట్టకేలకు బ్లాక్ బస్టర్ సొంతం చేసుకున్నాడు. కథాంశంలో విషయం ఉంటే వసూళ్ళు వాటంతటవే వస్తాయని 'సీతారామం' చిత్రం మరోసారి నిరూపించింది. ఈ సినిమా తెచ్చిపెట్టిన అద్భుతమైన సక్సెస్ హనుకు మరిన్ని భారీ అవకాశాల్ని తెచ్చిపెడుతుందని వేరే చెప్పాల్సిన అవసరం లేదు

## లైగర్ టీమ్ హన్మకొండలో హల్‌చల్

### సినిమాను బ్లాక్ బస్టర్ చేయాలన్న విజయ్ దేవరకొండ

పాన్ ఇండియా స్టార్ విజయ్ దేవరకొండ, పాత్ బ్రేకింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ల క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'లైగర్' ఆగస్ట్ 25న విడుదల అవుతుంది. ది గ్రేట్ మైక్ టైసన్ లైగర్ సినిమాతో ఇండియన్ సినిమాలో అరంగేట్రం చేస్తున్నారు. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, కరణ్ జోహర్, అపూర్వ మెహతా సంయుక్తంగా సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన లైగర్ ట్రైలర్, పాటలు ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలను పెంచాయి. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ , మలయాళం భాషల్లో ఆగస్ట్ 25న లైగర్ ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపధ్యంలో 'లైగర్' ఫ్యాన్డమ్ టూర్ ని వరంగల్-హన్మకొండ కాజీపేటలోని సత్యసాయి కన్వెన్షన్లో గ్రాండ్ గా నిర్వహించింది చిత్ర యూనిట్. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు ప్రేక్షకులందరికీ నా ప్రేమ. ఇండియా అంతా తిరిగి ఇక్కడికి వచ్చాం. కానీ ఎక్కడ తిరుగుతున్నా ఇక్కడి గురించే ఆలోచన. లైగర్ గురించి ఇక్కడ ఏమనుకుంటున్నారనే ఆలోచన. వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో పెద్ద ఈవెంట్ చేయాలని అనుకున్నాం. వర్షం వలన కుదరలేదు. కానీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ గారి ప్రోత్సాహం వలన ఈ ఈవెంట్ ఇక్కడ ఇంత గ్రాండ్ గా జరిగింది. నేను ఇండియాలో ఎక్కడి వెళ్ళిన జనాలు అమితమైన ప్రేమని పంచారు. ఊహించని రీతిలో జనాలు వచ్చారు. అసలు ఇంత ప్రేమ ఎందుకు చుపిస్తున్నారో అర్దమయ్యేది కాదు. అయితే ఏం జరుగుతున్నా అది ఇక్కడే మొదలైయింది. మన కాలేజ్ లో , మన థియేటర్ లో మన ఆంధ్ర తెలంగాణలో ఇది మొదలైయింది. మీరు పంచిన ప్రేమని మర్చిపోలేను.ఆగస్ట్ 25న మీ ప్రేమని తిరిగివ్వాలి. ఆగస్ట్ 25 ఆగ్ లాగా దేంగే అని వరంగల్ లోనే చెప్పాను. సినిమాపై ఎలాంటి డౌట్ లేదు. సినిమా బ్లాక్ బస్టర్. తెలంగాణ , ఆంధ్ర షేక్ చేస్తే ఇండియా మొత్తం వినిపించాలి. లైగర్ లో అమ్మా కొడుకు కరీంనగర్ నుండి బయలుదేరి కొడుకుని ఛాంపియన్ చేయాలని ముంబై వెళ్తారు. పూరి మా నాన్న, ఛార్మీ మా అమ్మలాగ ఇండియాని షేక్ చేద్దామని ముంబై వెళ్లాం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా కొట్టాలనే బయలుదేరాం. పూరి గారు రాసిన డైలాగ్ చెప్పాలంటే అదృష్టం వుండాలి. లైగర్ లో నాకు నచ్చిన డైలాగ్.. వి ఆర్ ఇండియన్స్.. పోదాం, కొట్లాడదాం.. ఆగ్ హే అందర్. దునియా కో ఆగ్ లగా దేంగే. సబ్ కి వాట్ లాగా దేంగే. ఆగస్ట్ 25న మనమందరం కలసి గట్టిగా కొట్టాలి. లైగర్ టీం అందరికీ థాంక్స్. ప్రేక్షకులందరికీ థాంక్స్. ఐ లవ్ యూ' అన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ.. వరంగల్ పై ప్రేమతో లైగర్ టీం ఇక్కడికి వచ్చింది. విజయ్ దేవరకొండ 25న దుమ్మురేపాలి. పూరి జగన్నాథ్, ఛార్మీ ఇక్కడ స్టూడియో పెట్టాలని కోరుతున్నా. కేసీఆర్, కేటీఆర్ గారితో మాట్లాడి లాండ్ ఇప్పించే భాధ్యత నాది. విజయ్ దేవరకొండ నాకు బాగా దగ్గర బంధవు. నా పిలుపుతో ఇక్కడి వచ్చారు. వరంగల్ లో మొదలుపెట్టిన ఈ చిత్రం వందశాతం విజయం సాధిస్తుంది' అన్నారు. అనన్య పాండే మాట్లాడుతూ... తెలుగు సినిమా కుటుంబం భాగం కావాలని కోరుకుంటున్నాను. ఆ అవకాశం ఇస్తారని కోరుకుంటున్నాను. లైగర్ తో తెలుగులో ఎంట్రీ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. విజయ్ దేవరకొండ, పూరి గారు, మైక్ టైసన్ గారితో పని చేయడం చాలా ఆనందంగా వుంది. విజయ్ దేవరకొండ నా బుజ్జి కన్నా. ఆగస్ట్ 25న లైగర్ సినిమా థియేటర్ లో పగిలిపోద్ది. లైగర్ ఫుల్ మాస్ కమర్షియల్ సినిమా. దింపుతున్నాం. మజా వస్తది' అన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in